క్లుప్తంగా

సౌండ్ సిస్టం వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజీపేట తండాకు చెందిన ప్రాథమిక పాఠశాలకు తండాకు చెందిన యువకుడు రమావత్ ప్రకాష్‌నాయక్ సౌండ్ సిస్టంను మంగళవారం వితరణ చేశాడు. పాఠశాలలో నిర్వహించే ప్రోగ్రామ్స్, కల్చరల్, డ్రిల్, సమావేశాలకు సౌండ్ సిస్టం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల కోసం కుర్చీలు అందజేసినట్లు తెలిపారు. దాతను అభినందించారు.

చెరుకు పంట పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులో రైతులు సాగుచేస్తున్న చెరుకు పంటను మంగళవారం స్థానిక ఏవో సాయికిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా గ్రామ శివారులో 12 ఎకరాల్లో ప్రధానంగా సీవో-297, సీవో-1218 రకాలకు చెందిన చెరుకు పంటను సాగు చేస్తున్నారన్నారు. చెరుకుపంటలో వచ్చే చీడపీడలతోపాటు వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి ఆయన వివరించారు. ఆయనవెంట రైతు నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఇళ్లు మంజూరు చేయిస్తామని ప్రలోభ పెట్టారు



భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామానికి చెందిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయిస్తామని ప్రలోభ పెట్టి కాంగ్రెస్ నేతలు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కాంగ్రెస్ కండువాలను కప్పించారని బీజేవైఎం జిల్లా కార్యదర్శి పైడి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ.. తిప్పాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నేతలు ఎవ్వరూ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరలేదన్నారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నేతలు అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. బీజేపీ తిప్పాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు వంగేటి నర్సారెడ్డి, సీనియర్ నేతలు బస్వారెడ్డి, కొండ సాయిలు, మల్లేష్‌రెడ్డి, ఉరడి భాస్కర్, వసంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయ శేఖర్



పిట్లం(జుక్కల్): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయ శేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తానని, వినూత్నమైన పద్ధతులను అవలంబించి మెరుగైన ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తానన్నారు. ఆయనకు కళాశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

సదాశివనగర్‌లో శ్రీనివాస్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యత స్వీకరించారు. ఇప్పటివరకు రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో ఇటీవల పదోన్నతి పొందిన సింగం శ్రీనివాస్ ప్రిన్సిపాల్‌గా సదాశివనగర్‌కు వచ్చారు. ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

విధుల్లో బాధ్యతగా మెలగాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి ఒక్కరు విధుల్లో బాధ్యతగా మెలగాలని సీఐ రవి కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎస్సై అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ సదస్సు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ సదస్సును నిర్వహించారు. కళాశాలలోని సోషల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు కళాశాల రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్ విఠల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోతరాజు శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడారు. యువత నైపుణ్యాల ద్వారా ప్రభుత్వ ప్రయివేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. అధ్యాపకులు రాజేష్, మనోహర్, అనిల్, అనిత్ పాల్గొన్నారు.

పర్మిట్ రూం కాదు... ఫంక్షన్ హాలే!

- మందు బాబులకు అడ్డాగా మారిన కల్యాణ మండపం
- అసంపూర్తి నిర్మాణంతో ఇబ్బందులు
- నాలుగేళ్లుగా పూర్తి చేయని వైనం





పర్మిట్ రూమును తలపించేలా ఉన్న బొమ్మన్‌దేవ్‌పల్లి కల్యాణ మండపం లోపలి పరిసరాలు

నస్రుల్లాబాద్: పైన కనబడుతున్న చిత్రాలు పర్మిట్ రూమువి కాదు.. శుభకార్యాలు జరుపుకునే ఫంక్షన్ హాలువి. మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి కల్యాణ మండపం మందుబాబులకు అడ్డాగా మారింది. గ్రామానికి చివరగా ఉండటంతో నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టి మధ్యలోనే నిలిపేశారు. 2021-22లో రూ.25లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో శంకుస్థాపన చేశారు. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నిధులు చాలక వదిలేశారని సంబంధిత గుత్తేదారు చెబుతున్నా కూడా అదనంగా రూ.5లక్షలు కేటాయించారని గ్రామస్తులు చెబుతున్నారు. అసంపూర్తిగా వదిలేయడంతో మందుబాబులు మందు తాగడానికి వాడుతున్నారు. అర్ధ రాత్రిళ్లు సైతం వివిధ కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు కల్పించుకొని కల్యాణ మండపం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జూకంటి బాపురెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ఎల్లవేళలా కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జూకంటి బాపురెడ్డి అన్నారు. మంగళవారం ఉత్తనూర్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బసంత్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తాబాది మోడల్ స్కూల్లో..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది మాడల్‌స్కూల్‌లో మంగళవారం పీఆర్‌టీయూ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుషాల్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పీఆర్‌టీయూ నాయకులు ప్రవీణ్, మనోజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తా



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని ఎంఈవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని రామారావు మహరాజ్ తండాలో పాఠశాల ఏర్పాటు చేయాలని తండావాసులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రామారావు మహరాజ్ తండాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తండాలో ఉన్న పిల్లల సంఖ్యను తెలుసుకున్నారు. 0-5 సంవత్సరాల లోపు పిల్లలు 14 మంది, 6-14 సంవత్సరాలలోపు పిల్లలు 24 మంది ఉన్నారు. దీంతో పాఠశాల ఏర్పాటుకు విద్యార్థుల సంఖ్య సరిపోదని, అంగన్‌వాడీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తండావాసులకు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



పిట్లం(జుక్కల్): స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మంగళవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో విద్యార్థులకు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దన్నారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదని అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్, పోలీస్ కళాబృందం సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



బాన్సువాడ రూరల్: తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతిఏటా ఆషాఢ మాసంలో తెలంగాణలోని ప్రతిపల్లెలో పెద్ద ఎత్తున బోనాల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు హాజరై మాట్లాడారు. సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించడం మనకర్తవ్యమన్నారు. పోచారం దంపతులను సన్మానించారు. ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఇంటింటా బోనాలు తీసి పట్టణంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కన్నయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండగ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో మంగళవారం ప్రజలు బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో ఊర దేవతలను ప్రత్యేకంగా కొలుస్తామని మహిళలు తెలిపారు.

మత్తడి మైసమ్మ పండుగ

పిట్లం(జుక్కల్): గోద్మెగావ్‌లో మంగళవారం మత్తడి మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మత్తడి మైసమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో గోరింటాకు సంబరాలు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఇందిరా మహిళా శక్తి సంబురాలు

బాన్సువాడ రూరల్: డ్వాక్రా మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం విడుదల చేయడంతో బుధవారం ఉదయం 11గంటలకు బీర్కూర్ రోడ్డులోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో మహిళా శక్తి సంబురాలు నిర్వహిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం పద్మ తెలిపారు. సంబురాలకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై 2024-25 కాలపు వడ్డీ చెక్కులను పంపిణీ చేస్తారని అన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన బోధన అందించాలి

మద్నూర్(జుక్కల్): గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉమ్మడి నిజామాబాద్ గురుకులాల కన్వీనర్ నీరడి గంగాశంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, ఉప సంక్షేమాధికారి నరహరి ప్రసాద్, అధ్యాపకులు, తదితరులున్నారు.

బీసీపీఎఫ్ ధర్నాకు తరలిన నేతలు



భిక్కనూరు: హైదరాబాద్‌లో బీసీపీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ధర్నాలో భిక్కనూరు మండల బీసీ నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ విద్య ఉద్యోగాల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. నేతలు అత్తిలి శ్రీనివాస్, తున్కిక వేణు, పాల రాంచంద్రం, ఉప్పరి సాయిలు, భాను, సరస్వతి ప్రభాకర్‌లు ఉన్నారు.

కలుపు యాజమాన్యంపై అవగాహన

బాన్సువాడ రూరల్: కోనాపూర్, తాడ్కోల్ రైతు వేదికల్లో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. వానాకాలం పంటలు, కలుపు యాజమాన్యం అనే అంశంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. పొలం గట్లపై గరిక, తుంగ వంటి కలుపు లేకుండా చూడాలని సూచించారు. ఏఈవోలు జ్ఞానేశ్వర్, రాణి, ఆదర్శరైతు ఈశ్వర్‌గౌడ్, వెంకటరమణరావు గాండ్ల సాయిలు తదితర రైతులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న మున్నూరు కాపు నేతలు

కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఒక రోజు ఓరియెంటేషన్ శిక్షణలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. శిక్షణ ఎంతో ప్రయోజనకరంగా ఉందని జిల్లా నాయకులు మామిండ్ల అంజయ్య, నీలం నర్సింలు అన్నారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు, రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తమరావులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

నేటి చిత్రం

నిలువెత్తు నిర్లక్ష్యం



బీబీపేట: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి ముదిరాజ్ వార్డులోకి వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకొని విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏపుగా మొక్కలు పెరిగాయి. అధికారులు వెంటనే తొలగించి విద్యుత్‌ను సరిచేయాలి.

– రాజు, బీబీపేట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

ఆలయ్ బలయ్‌ను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

దోమకొండ: ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహిస్తున్న భారత రాజ్యాంగ పరిరక్షణ బహుజన ఆలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కర్, కామారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరవుతారని ఆయన వివరించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, నాయకులు అబ్రబోయిన స్వామి, నిమ్మ శంకర్, మాజీ ఎంపీటీసీ సీతారాం, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలును స్వాగతిస్తున్నాం



కామారెడ్డి టౌన్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు జిల్లా కేంద్రంలో బీసీ డిక్లరేషన్ పేరుతో పార్టీ బహిరంగ సభ నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జడల రజనీకాంత్, ఉపాధ్యక్షుడు ఫుల్ సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి



బాన్సువాడ రూరల్: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ఏపుగా పెరిగిన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కోనోకార్పస్ చెట్లతో శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. గతంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారాయని వారు తెలిపారు. ప్రజలు రోగాలబారిన పడకుండా కాపాడాలని కోరారు. స్థానికులు రఘువీర్ పతంజలి, గాజుల రాజులు, ప్రీతంరెడ్డి తదితరులున్నారు.

మార్చురీని మార్చాలి



ఆర్ఎంవోకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడలో పునర్నిర్మిస్తున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మార్చురీ గదిని వేరే చోటుకు మార్చాలని బీజేపీ నాయకులు మంగళవారం ఆర్ఎంవో సుజాతకు వినతి పత్రం అందించారు. గతంలో ఉన్న ప్రదేశంలో తిరిగి నిర్మించడం వల్ల పక్కనే ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు భయాందోళనలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల పక్కనే మార్చురీ ఉండటం వల్ల తరచూ విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గదిని వేరే చోటుకు మార్చకుండా పనులు కొనసాగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు కోనాల గంగారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, చిదుర సాయిలు, చిరంజీవి, ప్రసాద్, మహేష్ తదిరతులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాతకు పూజలు



కార్యక్రమానికి హాజరైన ఆర్యవైశ్య మహిళలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం వన భోజనాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పెద్దమల్లారెడ్డి చౌరస్తా వద్ద ఉన్న వీరహన్‌మాన్ దేవాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్యుల కులదేవత వాసవీ మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, అధ్యక్షుడు పురాం రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బెజుగంచెరువుతండాలో వనభోజనాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతాండవాసులు మంగళవారం వనభోజనాల కోసం సమీపంలోకి అడవికి వెళ్లారు. ఈ సందర్భంగా అడవిలో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు.

సంక్షిప్తం

బీఎల్‌వోలకు ఓటు నమోదుపై అవగాహన

బిచ్కుంద(జుక్కల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు మాస్టర్ ట్రైనర్ రచ్చ శివకాంత్, ఇర్షాద్ అలీ అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారికి కొత్త ఓటరు నమోదు, మరణించిన వారి పేర్లను జాబితాలో నుంచి తొలగించడం, వలస వెళ్లిన ఓటర్ల పేరును జాబితా నుంచి తొలగించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బీఎల్‌వోలకు రాత పరీక్ష నిర్వహించి శిక్షణ అందించారు. అనుమానాలు ఉంటే మాస్టర్ ట్రైనర్లను అడిగి తెలుసుకోవాలని సూచించారు. డీటీ భరత్, ఆర్ఐ రవీందర్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో ఈనెల 27న నిర్వహించే ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భారత రాజ్యాంగ పరిరక్షణ అలయ్..బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని మంగళవారం కామారెడ్డికి వచ్చిన మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్, వర్కింగ్ అధ్యక్షుడు బి.బాల్‌రాజు, ప్రతినిధులు బట్ట నరేష్, ఆర్.రాజు, సాయితేజ, సంతోష్ ఉన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): దగ్గి గ్రామంలో పునఃప్రారంభమైన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం విష్ణువర్ధన్ రెడ్డి, సీఆర్పీ నందు రావు, ఉపాధ్యాయురాలు సంధ్య, సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

లంబాడా హక్కుల పోరాట సమితి కార్యవర్గం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల లంబాడా హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సునావత్ మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా అజ్మీరా స్వామి, యూత్ అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా సేవ్యను ఎన్నుకున్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి: ఎంఆర్‌పీఎస్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న నిజామాబాద్‌లో నిర్వహించే సమావేశానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. నేతలు పద్మారావు, ప్రవీణ్, సతీష్ తదితరులున్నారు.

మహిళ డిగ్రీకళాశాలలో కంటి వైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ మహిళడిగ్రీకళాశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మారుతిబాబు, కళాశాల ప్రిన్స్‌పల్ శోభారాణి, అధ్యాపకులు, వైద్యసిబ్బందిపాల్గొన్నారు.

నిరంకుశ విధానాలకు ఐక్య పోరాటాలే శరణ్యం

బాన్సువాడ రూరల్: కార్మికుల పట్ల కేంద్రప్రభుత్వ నిరంకుశ విధానాలకు ఐక్య పోరాటాలే శరణ్యమని ప్రజాసంఘాల నాయకులు వెంకట్‌గౌడ్, ఖలీల్, రవీందర్, మహాదేదిలు అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.